

సిద్దన్నమడుగు తండాలో చిరుత?

పాదముద్రలు పరిశీలించిన అటవీశాఖ అధికారులు

అప్రమత్తంగా ఉండాలని సూచన 6

ఆందోళనలో తండావాసులు



నేడు ప్రజా పాలన దినోత్సవం

» అతిథులుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, కే. కేశవరావు



వికారాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వికారాబాద్ జిల్లా కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మేడ్చల్ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో వారు జాతీయ పతాకం ఎగురవేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల కోసం అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సింగిల్‌విండో డైరెక్టర్ పదవికి రాజీనామా

» రైతు రుణమాఫీకి డిమాండ్



ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైతులకు రుణమాఫీ అందలేదని మంగళవారం చందుపట్ల ధర్మారెడ్డి తన రైతు సేవా సహకారం సంఘం డైరెక్టర్ పదవికి రాజీనామా ప్రకటించాడు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని రిజిస్టర్ పోస్టులో రైతుసేవా సహకార సంఘం ఎండీకి పంపినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలోని 1,189 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని వాపోయారు. గత అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ సంఘంలోని రైతులకు రుణమాఫీ రాలేదని, ఆవేదన వ్యక్త చేస్తూ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇదే విషయమై సింగిల్‌విడో ఎండీ రాహుల్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి రాజీనామా పత్రం అందలేదని తెలిపాడు.

పోషణ.. భవిష్యత్‌కు రక్షణ

జిల్లాలోని అంగన్‌వాడీ వివరాలు	
ప్రాజెక్టులు	03
ప్రధాన అంగన్‌వాడీలు	793
మినీ సెంటర్లు	14
బాలింతలు	5,792
గర్భిణులు	9,245
చిన్నారులు	1,12,364



నేటి నుంచి పోషణ మాసోత్సవాలు

- అక్టోబరు 16వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- చిరు ధాన్యాల వినియోగంపై విస్తృత ప్రచారం
- అవగాహన కల్పించనున్న అంగన్‌వాడీలు

మేడ్చల్ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నాయి. అయినా క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. వీటికి చెక్‌పెట్టేలా పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం సెప్టెంబరు నెలను పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు ప్రాజెక్టులున్నాయి. అల్వాల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ప్రాజెక్టుల్లో 793 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 14 మినీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో మూడు ప్రాజెక్టుల్లో కలిపి 5,792 మంది బాలింతలు, 9,245 మంది గర్భిణులు, ఆరేళ్లలోపు చిన్నారులు 1,12,364 మంది ఉన్నారు. అని కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ఒక పూట భోజనం, ఒక ఉడికించిన గుడ్డు, 200మి.లీ పాలు అందజేస్తున్నారు. అలాగే బాలామృతం 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు, 6 సంవత్సరాల పిల్లలకు ప్రతీ రోజు ఒక గుడ్డు



మిగతా 8వ పేజీలో...



అవగాహన కల్పిస్తాం

నేటి నుంచి అక్టోబరు 16 వరకు జిల్లాలో పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నాం. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పిస్తాం. ఇంటింటికి తిరిగి తల్లిపాల విశిష్టత గురించి తెలియజేస్తాం. పిల్లలకు అవసరమైన టీకాలు, పెరటి తోటల పెంపకం గురించి వివరిస్తాం. రక్తహీనత పరీక్షలు కూడా నిర్వహించనున్నాం.

-శారద, జిల్లా సంక్షేమాధికారి

వచ్చేనెల 3న కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి



కొడంగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్టోబరు 3న కొడంగల్‌కు రానున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతీ ఏడాది మాదిరిగా సొంత గ్రామం కొండారెడ్డిపల్లికు వెళ్లి, మరుసటి రోజు కొడంగల్‌లో పర్యటించి పార్టీ శ్రేణులను కలవనున్నారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటినుంచి దసరా మరుసటి రోజు కొడంగల్ ప్రజలను కలుస్తున్నారు. ప్రస్తుతం సీఎం హోదాలో రెండోసారి కొడంగల్‌కు రానున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు?

ఈ నేపథ్యంలో కొడంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. హరే రామ, హరే కృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో అల్పాహారం, బోజన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో పాటు మున్సిపల్ నూతన భవనం ప్రారంభోత్సవం, మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు భూమి పూజ తదితర వాటికి శంకుస్థాపనలు చేయనున్నట్లు సమాచారం.

12రోజులు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

» జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి



మేడ్చల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేటి నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలో 12 రోజుల పాటు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి మంగళవారం తెలిపారు. మహిళల ఆరోగ్యం - శక్తివంతమైన కుటుంబాలు అనే లక్ష్యంతో కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు జిల్లాలో 11 ప్రత్యేక వైద్య శిబారాల చొప్పున జిల్లా వ్యాప్తంగా 121 వైద్య శిబిరాల ద్వారా మహిళలకు నిపుణులచే పరీక్షలు, చికిత్సలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో ప్రసూతి, చిన్న పిల్లల నేత్ర, దంత, చర్మ , చెవి, ముక్కు, గొంతు, డెర్మటాలజీ, సైకియాట్రీతో పాటు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. దీనిని జిల్లాలోని మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

» జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్

దౌల్తాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారే ఉన్నత విజయాలు సాధించారని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ సూచించారు. మంగళవారం దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయనతో పాటు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ హనుమంతు, రిటైర్డ్ హెచ్‌ఎం వీరన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య, అన్నీ సదుపాయాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, వినయాన్ని నేర్పించడంలో కళాశాల యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని ప్రిన్సిపాల్ వసంత తెలిపారు. విద్యార్థులు ఫోన్‌లకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు భేష్

» చార్మినార్ జోన్-6 డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్

» చెన్‌గోముల్ పోలీస్ స్టేషన్ తనిఖీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్

పూడూరు, సెప్టెంబరు 16, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు బాగా పనిచేస్తున్నారని చార్మినార్ జోన్-6 డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్ కితాబునిచ్చారు. ఆయన మంగళవారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ముందుగా ఆయన పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భవనం పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా గంజాయి ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే స్పెషల్ సర్చ్ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణలపై అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పోలీసులు ప్రజలతో మమేకమై సైబర్ క్రైం, గంజాయి వంటి మాదవ ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలు సహకరించాలని కోరారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వంగా వ్యవహరించి వారి సమస్య త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, కౌడీలు అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సిబ్బందికి ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా అధికారులకు సంప్రదించాలని, ఉన్నతాధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయన వెంట ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





ఊరేగింపులో ఎమ్మెల్యే శంకర్, భక్తులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

కొత్తూర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఇన్ముల్‌నర్వలోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా వద్ద మిలాద్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇన్ముల్‌నర్వ ఏక్ మినార్ నుంచి దర్గా వరకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వేలాది మంది ముస్లింలు ఊరేగింపుగా బయల్దేరారు. దర్గాకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించి పాతియాల్ సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అలీఖాన్‌బాబర్, డైరెక్టర్ రవినాయక్, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఖాజాపాషా, ఎ.రవికుమార్, తిరుపతిరెడ్డి, జె.నర్సింహ, సాదిక్, ఇబ్రహీం, శంకర్‌నాయక్, హబీబ్ పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సహకారం గొప్పది

చేవెళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం చాలా గొప్పదని పర్యావరణ అవార్డీ, సామాజికవేత్త రామకృష్ణారావు అన్నారు. మంగళవారం చేవెళ్లకు చెందిన రియలెస్టేట్ వ్యాపారి జూకన్నగారి జైపాల్‌రెడ్డి తనకుమారుడు గీత్ శ్రీనందన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బాలికల పాఠశాలకు బీరువాలు, ఇతర సామగ్రి అందజేశారు.

మేకల దొంగలకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

రూ.2.62లక్షల నగదు, నాలుగు కార్ల స్వాధీనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పగలంతా కార్లలో తిరుగుతూ రెక్కీ నిర్వహించి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మేకలు, గొర్రెల అపహరణకు పాల్పడుతున్న ఏడుగురు దొంగల ముఠాను సోమవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్(24),అబ్దుల్‌కలీం(25), మహ్మద్ సొహైల్(24), షేక్ రవూఫ్(23), మహ్మద్ జమీర్(26), ఆరిఫ్(25), షేక్ హసీనుద్దీన్(22),కోయల్కార్ సాయికిరణ్(30)లు ముఠాగా ఏర్పడ్డారన్నారు. వీరు కార్లలో తిరుగుతూ ఎక్కడెక్కడ మేకలు, గొర్రెలమందలు పెడతారో రెక్కీ నిర్వహించి రాత్రిళ్ల డీసీఎంలో వాటిని తరలిస్తున్నారని తెలిపారు. మేకలు, గొర్లను జియాగూడ మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తారని చెప్పారు. చించోడులో 28, వెలిజర్లలో8, చౌదరిగూడలో 8, పెద్ద ఎల్కిచర్లలో 23, తంగెళ్లపల్లిలో 8, వెంకిర్యాలలో 9, పరిగి మండలం కోటివాడలో 12, సుల్తాన్‌పూర్‌లో 30, దోమ మండలం ఉదంతారావుపల్లిలో 15, జధిరసంపల్లిలో ఆరు జీవాలను అపహరించారని తెలిపారు. జియాగూడలో మేకలను విక్రయిస్తుండగా వాటి యజమాని ప్రవీణ్ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో తాము దొరికిన వారిని విచారించగా మొత్తం వ్యవహారం బయటపడిందన్నారు. ఈ నెల 14న షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి సోలీపూర్‌లో మేకల దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.2.6లక్షలు, నాలుగు డీసీఎంలు, నాలుగు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సిద్దన్నమడుగు తండాలో చిరుత?

- ఆందోళనలో తండావాసులు



తండా సమీపంలోని పొలాల్లో చిరుత పులి కాలిగుర్తులు



కాలు గుర్తులను కొలతలు వేసి పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారి



పెద్దేముల్/తాండూరు రూరల్: సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దన్నమడుగుతండా వ్యవసాయ పొలాల్లో చిరుత సంచరించినట్లుగా ఆనవాళ్లు బయటపడ్డాయి. అదిచూసిన రైతులు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. మండలంలోని తట్టెపల్లి అటవీ ప్రాంతంలోని సిద్దన్నమడుగుతండా వ్యవసాయ పొలాల్లో మంగళవారం ఉదయం రైతులకు పెద్దపెద్ద పాదముద్రలు కనిపించాయి. అవి చిరుత కాలిగుర్తులే అయ్యుంటాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యవసాయపొలంలో కనిపించిన కాలిగుర్తులను కొలతలు వేసి పరీక్షించారు. పాదముద్రలు చిరుతవి అయ్యుంటాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే పూర్తిగా అవి చిరుతవే అని చెప్పలేమని, ల్యాబ్‌కు పంపించి పూర్తినిర్ధారణ చేసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతి పేర్కొన్నారు. ఉద్దండాపూర్, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డతండా తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి పేర్కొన్నారు. అయినప్పటికీ పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఆధారాలు లభించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో స్వప్న, ఎఫ్‌బీవో నాగసాయి పాల్గొన్నారు.

మంగల్‌పల్లి ప్యాక్స్ చైర్మన్‌గా శ్రీశైలం



ఆదిభట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగల్‌పల్లి సొసైటీ చైర్మన్‌గా ఆదిభట్ల డైరెక్టర్ జమ్ము శ్రీశైలాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాత చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక జీవోతో డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ తనకు చైర్మన్ పదవి వచ్చేలా చూసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతిని కాపాడుదాం

ఆదిభట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు ప్రకృతి సంపదను కాపాడుకోవాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిభట్ల పరిధి కొంగరకలాన్ పాఠశాలల్లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన 'యంగ్ ఎర్త్ లీడర్స్' ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్ వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి, సునీత, సమత, రామచంద్రయ్య, యాదయ్య, శ్రీవేణి, భాస్కర్, పాండు, నిహారిక, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి



చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధి స్కీం పేదలకు వరంలా నిలుస్తోందన్నారు.ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో యాదయ్య, బాబర్, మొయినుద్దీన్, నబీ, నాగులు, భీమయ్య, నిరంజన్, నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, జోగయ్య, ఆనంద్, శ్రీనివాస్, రవి, రమేశ్, శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్, సుమన్ పాల్గొన్నారు.

7వ రోజుకు చేరిన రుణమాఫీ దీక్షలు



రిలే దీక్షలో రైతులు, నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం 7వ రోజుకు చేరుకున్నాయి. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయఅధికారి రాజారత్నం,

మోమిన్‌పేట్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ జిల్లా అధికారి రాజారత్నం అన్నారు. మోమిన్‌పేట్, మేకవనంపల్లి సొసైటీల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి జయశంకర్‌తో కలిసి యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తక్కువ ధరకు లభించే నానో యూరియా వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు చంద్రిక, సీఈవో జహంగీర్, సిబ్బంది బాలకృష్ణ, యాదయ్య, డైరెక్టర్‌లు, రైతులు గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పదవులు లేకున్నా ప్రజల్లోనే ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పదవులు ఉన్నా, లేకున్నా తాను నిరంతరం ప్రజల మధ్యే ఉంటానని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవిలు అన్నారు. శెట్టిపల్లిలో మంగళవారం సత్యం, గోదాదేవిలు పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిన మల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. దసరా నేపథ్యంలో సొంత డబ్బులు రూ.3లక్షలతో రోడ్ల మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు.

బాలాజీసింగ్‌కు ఎంపీ పరామర్శ



రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ తండ్రి రతన్ సింగ్‌ఠాకూర్ మృతిపట్ల నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలు సంతాపం తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలోని ఆయన నివాసంలో రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి బాలాజీసింగ్‌ను పరామర్శించారు. టీచర్‌గా రతన్‌సింగ్ అందించిన సేవలను కొనియాడారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, గుర్రం కేశవులు, సంజీవ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.
















చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి)

ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేనిది 1948 సెప్టెంబరు 17 ఘట్టం. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' సంస్థకు నాయకుడు. ఆయన స్వస్థలం మరాఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని ఆ సంస్థకు రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించి, పలు హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం (పోలీసు చర్య) అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలైన రజ్వీ అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న రజ్వీ 1970, జనవరి 15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు. .


భయంతో ఆస్తులమ్మారు

పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలీ ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి.



దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు



నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంత మంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాబ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.



రావిర్యాల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిన కేసీఆర్

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాలు, బతుకమ్మ పండుగల వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడ, రావిర్యాల, మంకాల్ చెరువుల వద్ద బతుకమ్మ ఘాట్లను ఆమె పరిశీలించారు. బతుకమ్మల నిమజ్జనానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఘాట్లను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగిందని వార్తలొస్తున్నాయి, దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరం మోడల్ స్కూల్ జిల్లాలో ఆదర్శవంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జెల్లల లక్ష్మయ్య, సామెల్‌రాజు, రవినాయక్, సుమన్, మున్సిపల్ కమిషనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి 'అవేర్' కృషి



మాధవన్‌జీని సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ఆవేర్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. మంగళవారం సరస్వతిగూడ వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30ఏళ్ల క్రితం స్థాపించిన అవేర్ సంస్థ ఆధ్వర్యంలో హాస్పిటళ్లను నిర్మించి గ్రామీణులకు ఉచిత వైద్యశిబిరాలతో పాటు వాటర్‌షెడ్ల ద్వారా వ్యవ సాయ రంగానికి సేవలందిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు సరస్వతిగూడలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, ఆలయ నిర్మాణానికి సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రశాంత్‌కుమార్, నాయకులు బి.యాదయ్య, జి.నర్సింహ, జి.సత్యనారాయణరెడ్డి, కె.రాజిరెడ్డి, కె.శ్రీనివాస్, వెంకన్న, ఎ.మహేందర్, కె.పాండురంగారెడ్డి, బి.మమాదగిరి, మల్లేశ్, యాదయ్య, శ్రీనివాస్, రవీందర్, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లంలోనే బోధించాలి

చౌదరిగూడ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలోనే బోధన చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ లింగయ్యగౌడ్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ హైస్కూల్, లాల్‌పహాడ్‌లోని కస్తూర్బా పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లాస్ రూంలో బోధన తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ఆంగ్ల మాధ్యమంలోనే సులువైన భాషలో బోధించాలని టీచర్లకు సూచించారు. బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, జీహెచ్ఎం సునీత, కేజీబీవీ ఎస్వో రాగసుధ ఉన్నారు.

దొంగ జీవోలతో చైర్మన్లను తొలగిస్తున్న ప్రభుత్వం

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్లను ప్రభుత్వం అడ్డగోలు దొంగ జీవోలతో పదవుల నుంచి తొలగిస్తోందని మహేశ్వరం ప్యాక్స్ మాజీ చైర్మన్ మంచె పాండుయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్‌కు త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. మహేశ్వరం ప్యాక్స్ చైర్మన్‌గా ఉన్న తనకు తెలియకుండా అర్ధరాత్రి జీవోలు తెచ్చి పదవి నుంచి తప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం ఉంటే అన్ని వర్గాలకు ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓడిపోతామే కాంగ్రెస్ నాయకులు దొడ్డిచాటున పదవుల్లో కూర్చుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్‌రెడ్డి, పి.బాలయ్య, కె.ప్రభాకర్, ఎం.ఏ.సమీర్ పాల్గొన్నారు.

నాలాల ధ్వంసంపై హైడ్రాకు ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నాలాలను ధ్వంసం చేసి తమ చెరువుల్లో నీరు రాకుండా చేస్తున్నారని మంగళవారం అంకుశాపూర్‌కు చెందిన బద్దం వేణుగోపాల్‌రెడ్డి హైడ్రా కమిషనర్‌తో పాటు నీటిపారుదలశాఖ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. అంకుశాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనంబర్లు 258, 259, 161, 261, 271, 263, 264, 265, 267, 268, అవుశాపూర్ సర్వేనంబర్లు 269, 274లలో ఫార్చున్ కీర్తి రియల్‌వ్యాపార సంస్థ 38ఎకరాల్లో వెంచర్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నాలాలను కబ్జా నుంచి విడిపించి చెరువులోకి నీరు సజావుగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

» పులుమద్ది, లింగంపల్లిలో యూపీ బృందం



పులుమద్ది గ్రామంలో ఉత్తరప్రదేశ్ బృందం

వికారాబాద్/నవాబుపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది, నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామాల్లో ఉత్తరప్రదేశ్ పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు కన్సల్టెంట్ల 33 మంది బృందం సోమవారం పర్యటించారు. పులుమద్ది గ్రామాన్ని సందర్శించి స్థానిక అభివృద్ధిపై ఎంపీడీవో వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పీపీవీ, టీజీకేపీ, సోక్ పిట్స్, వ్యర్థాల వర్గీకరణ షెడ్, ఆదాయ - వ్యయాలు, శానిటేషన్, రహదారులు వంటి అంశాలను పరిశీలించారు. వారు మొదటగా పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ యార్డు పరిశీలించారు. అలాగే లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ నవాబుపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పులుమద్ది కార్యక్రమంలో టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ అనిల్ కుమార్, ఎంపీవో దయానంద్, ఏపీఓ శ్రీనివాస్, అలాగే లింగంపల్లి గ్రామంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీవో విజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి జ్యోతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టించుకోని పాలకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గోస ఎల్లదీస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జి.జైపాల్‌యాదవ్ ఆరోపించారు. గట్టిప్పలపల్లి సొసైటీ గోదాం వద్ద మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జైపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేల రూపాయలు పెట్టుబడులుపెట్టి సాగుచేసిన పంటలకు యూరియా దొరక్క రైతులు దుకాణాలు, పీఏసీఎస్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పద్మనర్సింహ, నాయకులు, రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, జయమ్మవెంకటయ్య, శిరీషకృష్ణయ్య, రాజు, జంగయ్య, శరత్‌చంద్రశర్మ, కృష్ణయ్య, అశోక్‌గౌడ్, శరత్, ఆంజనేయులుగౌడ్, రాజు, రవీందర్, కొండల్, మల్లేశ్, చంద్రశేఖర్, రత్నయ్య, పర్వతరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీజ్ చేసినా దర్జాగా నిర్మాణం

» తూంకుంటలో అక్రమంగా కన్వెన్షన్ హాల్

» మరోసారి సీజ్‌చేసిన మున్సిపల్ అధికారులు



హెచ్చరిక బోర్డును పెట్టిన మున్సిపల్ టీపీవో శ్రీధర్, సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని సర్వే నంబర్-334లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భారీ కన్వెన్షన్‌హాల్‌ను నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు ఇదివరకే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా సీజ్ చేశారు. అయినప్పటికీ కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారీ షెడ్డు పనులను మంగళవారం చేపట్టారు. దీంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం తూంకుంట మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్, సిబ్బంది స్పందించి పూర్వాపరాలను పరిశీలించారు. రెండో సారి సీజ్ చేసి, హెచ్చరిక బోర్డును పెట్టారు. ఈ విషయంపై టీపీవో శ్రీధర్ మాట్లాడుతూ ఒకసారి సీజ్ చేసిన తర్వాత మళ్లీ నిర్మాణం పనులు చేపడితే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

దేవుళ్ల పేరుతో వసూళ్లు

» నలుగురు నిందితుల అరెస్ట్

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేవుళ్ల పేరుతో బలవంతంగా వసూళ్లు చేస్తున్న నలుగురు వ్యక్తులను శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మంగళవారం తూంకుంటలో జరిగింది. తూంకుంటలోని శశిసాయి నారాయణ, చంద్రారెడ్డి కాలనీల్లో మంగళవారం మధ్యాహ్నం నలుగురు యువకులు పలువురి ఇళ్లలోకి వెళ్లి చేయికి రంగు దారం కట్టి పుస్తకంలో పేర్లు రాసుకుంటున్నారు. తాము దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామని చెబుతూ రూ.20వేలు చందాఇవ్వాలని పలువురిని డిమాండ్ చేశారు. తమ వద్ద లేవని చెప్పినప్పటికీ దారం కట్టిన వారు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని చెప్పారు. మిమ్మల్ని వదలమంటూ బెదిరిస్తూ ఫోన్‌పే ద్వారా ఒకరి నుంచి రూ.500, మరొకరి నుంచి రూ.2వేలు పంపించుకున్నారు. విషయం తెలుసుకున్న శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టగా యాదాద్రి జిల్లా పరిధిలోని బీబీనగర్ ప్రాంతానికి చెందిన యువకులు నాగరాజు, శ్రీనాథ్, లక్ష్మణ్, రాజు అని తేలింది. కాగా పోలీసులు ఆ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4 సెల్ ఫోన్లు, రెండు బైకులు, దారం ఉండలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.

హైటెన్షన్ లైన్ అలైన్మెంట్‌ను గతంలోనే వ్యతిరేకించా

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

కడ్తాల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కడ్తాలలో రైతుల పొలాల మీదుగా 765హైటెన్షన్ లైన్ ఏర్పాటును 2023లోనే తాను వ్యతిరేకించానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైటెన్షన్ లైన్‌తో రైతులకు నష్టం కలగకుండా తాను కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం రైతులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి పంట భూములు పోకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కొందరు పారిశ్రామికవేత్తల ఒత్తిడితో అలైన్మెంట్ మార్చారని విచారం వ్యక్తం చేశారు. బీదర్-మహేశ్వరం హైటెన్షన్ లైన్ పనులను నిలిపివేయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. రైతుల విన్నపాన్ని ప్రభుత్వం, కలెక్టర్‌కు దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్, హన్మనాయక్, కడారి రామకృష్ణ, జంగారెడ్డి, చేగూరి వెంకటేశ్, బిచ్యానాయక్, పిప్పల్ల వెంకటేశ్, పెంటారెడ్డి, శ్రీరాములు, రాములు, అభినవ్‌రెడ్డి, పర్వతకుమార్, శివరామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు

ఆమనగల్లు: రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, జగన్, రమేశ్‌గౌడ్, జంగారెడ్డి, రమేశ్‌నాయక్, సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ ఉన్నారు.



వినాయక చౌరస్తాలో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

కొడంగల్ అభివృద్ధిలో ముందడుగు

» కోస్గి-మహబూబ్‌నగర్ హైవే పనులు ముమ్మరం

కొడంగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి కొడంగల్ మీదుగా చించోలి హైవే రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొడంగల్‌లో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు విస్తరణ కోసం పనులను వేగవంతం చేశారు. ఇరుకుగా ఉన్న వినాయక చౌరస్తాలో రోడ్డుకిరువైపులా ఉన్న పురాతన భవనాలను సైతం తొలగిస్తున్నారు. కొడంగల్ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



తుక్కుగూడలో 2కే రన్‌లో పాల్గొన్న కేఎల్లార్

ప్రతీ ఒక్కరు వ్యాయామాన్ని అలవర్చుకోవాలి

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోజూ ఉదయం నడకను, పలురకాల వ్యాయామం చేస్తే నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించే వీలుంటుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడలో నాయకులు, కార్యకర్తలతో కలిసి 2కే రన్ నిర్వహించారు. కేఎల్లార్ మాట్లాడుతూ.. జపానీలు వందేళ్లు ఆరోగ్యంగా ఉంటున్నారంటే వారు వ్యాయామాలు చేయడమేనన్నారు. ఉరుకులు పరుగుల జీవితాలతో చిన్నారులు సైతం వ్యాధుల బారినపడుతున్నారని అన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా రోజూ కొంతసేపు వ్యాయాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య, అల్లె కుమార్, రాజునాయక్ పాల్గొన్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. బొమ్మరాశిపేట పరిధిలోని శాంతినికేతన్ విద్యాలయ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో మంగళవారం 69వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి, దీపక్ రతన్, మదన్‌మోహన్‌రెడ్డి, నరేష్, రాజశేఖర్, నరేష్, దుర్గ పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురసిన భారీ వర్షాలకు శామీర్‌పేట పెద్ద చెరువు వరద నీటితో కళకళలాడుతోంది. ఈ సందర్భంగా మంగళవారం అలియాబాద్ మాజీ సర్పంచ్ గుర్కకుమార్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, రైతులు చెరువు అలుగు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అలాయాబాద్ గ్రామం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు.

ఆగని యూరియా లొల్లి


బషీరాబాద్: నవాంద్గీ సొసైటీ గోదాం వద్ద క్యూలైన్‌లో రైతులు

బషీరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చాలీచాలని యూరియా సరఫరాతో రైతన్నలకు కష్టాలు తప్పడంలేదు. బషీరాబాద్‌లోని నవాంద్గీ సొసైటీకి మంగళవారం ఓ లారీ యూరియా రావడంతో రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. గోదాం వద్ద తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. వ్యవసాయాధికారిణి అనిత, సొసైటీ అధికార సిబ్బంది బండెయ్య, ఫారుఖ్ తదితరులు గంటకు పైగా గోదాం బయటే ఉండిపోయారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా ఇస్తామని అక్కడున్న సొసైటీ సిబ్బంది చెప్పుకొచ్చారు. అవి సరిపోవని రైతులు గోదాం ఎదుట ఆందోళనకు దిగారు. అప్పటికే సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు గోదాం వద్దకు చేరుకుని రైతులను సముదాయించి క్యూలో నిలబడేలా చర్యలు తీసుకున్నారు.

దోమ: మండల కేంద్రానికి యూరియా రావడంతో రైతులు ఉదయం నుంచి కేంద్రం ఎదుట బారులుతీరారు. ఆధార్ కార్డులతో క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. అందులో కొంత మందికి మాత్రమే యూరియా అందించడంతో మిగతా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సరిపడే యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరారు.


వికారాబాద్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ధారూరు: ధారూరు, నాగారం, కేరెల్లికి 225బస్తాల చొప్పున యూరియా నిల్వలు వచ్చాయి. ఏఈవోలు టోకెన్‌లు జారీచేసి ఒక్కోబస్తా చొప్పున పంపిణీ చేశారు.

వికారాబాద్: వికారాబాద్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. వికారాబాద్‌కు రాత్రి యూరియా వచ్చిందని తమకు సమాచారం ఉందని కానీ ఏవో యూరియా సరఫరాలేదని చెబుతున్నారని మండిపడ్డారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై యూరియాను బ్లాక్‌లో అమ్మకాలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు


మాట్లాడుతున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మమత

పెద్దేముల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడుతేనే భవిషత్తు ఉంటుందని తాండూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మమత అన్నారు. కందనెల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రపంచ ఓజోన్‌డేను పురస్కరించుకుని మొలక బాలల మాసపత్రిక ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మొలక స్పెషల్ కరస్పాండెంట్ కేవీఎం.వెంకట్, జీహెచ్‌ఎం.శివకుమార్, ఉపాధ్యాయులు సత్యం, రమాదేవి, లావణ్య, సంతోష్‌కుమార్, అనురాధ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మెడికల్ కళాశాల విద్యార్థిని మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని మెడిసిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న అనూష(20) మంగళవారం తన మిత్రుడు మహేశ్వర్‌రెడ్డితో కలిసి పల్సర్ బైక్‌పై వస్తుండగా కండ్లకోయ జాతీయ రహదారి సమీపంలోని ఆక్సిజన్ పార్కు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అనుష తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. మహేశ్వర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం మేడ్చల్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

యాలాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని అక్కంపల్లిలో చోటు చేసుకుంది. యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కంపల్లికి చెందిన సావిత్రికి అదే గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తితో 16ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే మల్లేశం మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. భర్తతో పాటు ఆడపడుచులు ఆమెను తీవ్రంగా వేధించేవారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన మల్లేశం తీవ్రంగా కొట్టడంతో మనస్తాపానికి గురైన సావిత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సావిత్రి మంగళవారం మృతిచెందింది. మృతురాలి తల్లి వడ్డె రాములమ్మ ఫిర్యాదు మేరకు మల్లేష్, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని బాలుడి అదృశ్యం


సాజన్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన బిసంబర్ సైని ఐదేళ్ల కిందట ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఎదులాబాద్‌కు చెందిన రామిరెడ్డి వద్ద గడ్డి కోసే పనిచేస్తున్నాడు. బిసంబర్ కొడుకు సాజన్ కుమార్(17సంవత్సరాలు) సైతం అక్కడే ఉండి పనిచేసేవాడు. ఈనెల 8వ తేదీన సాయంత్రం సాజన్ కుమార్ ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి తండ్రి తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేదు. తన కుమారుడికి మతిస్థిమితం సరిగ్గా లేదని తెలిపారు. మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

యాలాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దౌలాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దౌలాపూర్ శివారు ప్రాంతంలోకి వెళ్లిచూడగా, ఐదు టిప్పర్లలో ఎర్రమట్టి నింపి ఉండగా, ఒక టిప్పర్ ఖాళీగా ఉందని తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ఐదు టిప్పర్లను యాలాల పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ల్యాప్‌టాప్ చోరీ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ల్యాప్‌టాప్ చోరీ అయిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడకు చెందిన దారిమడుగు అంకప్ప నాయుడు(28) పోచారం ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన తన హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను అన్నోజిగూడలోని ఓ వైన్‌షాపు కౌంటర్ వద్ద పెట్టి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలోఓ గుర్తుతెలియని దుండగులు ల్యాప్‌టాప్ అపహరించుకెళ్లారు. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. దీంతో మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్లు నిల్వఉంచిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్యాస్‌సిలిండర్లు నిల్వ ఉంచిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి సిలిండర్లను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చౌదరిగూడ, వెంకటాద్రి టౌన్‌షిప్ సమీపంలో రెడ్డి టిఫిన్ వద్ద అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉన్న సమాచారం మేరకు దాడిచేసి నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. టిఫిన్‌సెంటర్ నిర్వాహకుడు రంగారెడ్డి హరివర్దన్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేటీఆర్, హరీశ్‌రావు కృష్ణార్జునులు


కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్, హరీశ్‌రావు బీఆర్‌ఎస్‌కు కృష్ణార్జునుల వంటి వారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వారిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాకు సంబంధించిన పలు రాజకీయ విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి డిబెట్‌లో అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ ఏయిమ్స్(అల్ ఇండియా మెడికల్ సైన్స్)లో 'యువత ఆత్మహత్యలను తగ్గించడంలో కృత్రిమ మేధస్సు పాత్ర' అనే అంశంపై జరిగిన డిబెట్‌లో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ డిబెట్‌లో బీజెడ్‌సీకి విభాగానికి చెందిన శారన్, భవాని వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్నేహలత, వైస్‌ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఎక్మాయిలో నీటి ఎద్దడిపై ఫిర్యాదు

బషీరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని కొత్త కాలనీలో నీటి సమస్యను తీర్చాలని స్థానిక ప్రజలు మంగళవారం గ్రామ కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సాయిరెడ్డి, మధు, నర్సింహులు స్థానిక ప్రజలు పలువురు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ

పరిగి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఓ కండక్టర్ తిరిగి ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీని చాటుకుంది. పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు వెళుతున్న క్రమంలో ఓ ప్రయాణికురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. బస్సులో లభించిన సెల్‌ఫోన్‌ను కండక్టర్ లక్ష్మికి దొరికింది. దీంతో ఆమె పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామానికి చెందిన శ్వేతదిగా గుర్తించి తిరిగి ఆమెకు అప్పగించింది. దీంతో కండక్టర్ లక్ష్మిని స్టేషన్ మేనేజర్ బీపీ నాయక్, తదితరులు అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

తాండూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తాండూరు మండల అంగన్‌వాడీ టీచర్లు సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు సూపర్‌వైజర్లుగా, హెల్పర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు.

బల్దియా అధికారుల మార్నింగ్‌వాక్


మార్నింగ్‌వాక్‌లో అధికారులు

తాండూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ యాదగిరి, మునిసిపల్ సిబ్బంది మంగళవారం ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఇందిరానగర్, రహమత్‌నగర్, గుండుపీర్ల, హమాలీబస్తీ, రామ్‌మందిర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులు


పరిగి: ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

పరిగి,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలవాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని ఉపాధ్యాయులను బుధవారం పరిగిలోని ఎస్‌వీ గార్డెన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మండలంలోని 17మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్, కులకచర్ల మండలాల ఎంఈవోలు రాంచందర్, హబీబ్ అహ్మద్, ఎంపీడీవో సోమలింగం, ఎస్సై రమేశ్‌కుమార్, అశోక్‌కుమార్, నాగరాజు, రామ్మోహన్‌శర్మ, రాజిరెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలానికి చెందిన వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, రేణుకరెడ్డి, ప్రశాంతి, జీవన్‌జ్యోతి, సంధ్యరాణిలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కేశవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో భాగ్యమణి ఆధ్వర్యంలో మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింగరావు, లక్ష్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి


సీసీకెమెరాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషిచేయాలని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడ జెడ్పీహైస్కూల్‌లో రూ.90వేల తన సొంత ఖర్చులతో ఎనిమిది సీసీ కెమెరాలను మంగళవారం ఏర్పాటు చేయించారు. నూతనంగా నిర్మించిన మూత్ర శాలలను ఆయన తన సోదరులు బోయపల్లి సత్తిరెడ్డి, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కేఎంరెడ్డి, జితేందర్, అర్జున్‌రెడ్డి, తిలక్, మహేందర్, రాఘురాంరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, రాఘవేందర్‌రెడ్డి, సంతోష్, ప్రశాంత్, ఉపాధ్యాయులు రాందాస్, కవిత, అనురాధ, భవాని, అమరేశ్వరీ, భాషయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని అమలు చేయాలి

నవాబుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో కలిసి మంగళవారం నవాబుపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పింఛన్ పెంపుదలతో లబ్ధిదారులకు అందించాని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుష్పరాణి, సుధాకర్, రేవంత్‌రెడ్డి, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పోషణ.. భవిష్యత్‌కు రక్షణ

(ఐదో పేజీ తరువాయి)

చొప్పున అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారిలో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉండటంతో ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో తెలియని పరిస్థితి. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఉబకాయం నివారణ, 3 - 6 వయస్సు పిల్లలకు విద్యతో పాటు సంరక్షణ, ముర్రుపాలు - తల్లిపాల ప్రాముఖ్యత వంటి వాటిపై అవగాహన కల్పించనున్నారు. ఈ నెలంతా గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, కలిగే ప్రయోజనాల గురించి కార్యక్రమాలు నిర్వహిస్తూ వివరించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు..

ఇందులో భాగంగా చిరు ధాన్యాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి వల్ల కలిగే లాభాలు ఎంత వరకు ఉంటాయో కేంద్రాల్లో వివరిస్తారు. బాలింతలు, గర్భిణులు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీటి ద్వారా మానసిక ఎదుగుదల, వ్యాధి నిరోధకశక్తి పెరగనుంది. బియ్యం, గోధుమలు, జొన్నలు, సజ్జలు , పెసర, సెనగ, వేరుసెనగ, నువ్వులు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో తెలిపారు.

నేటి నుంచి మెగా వైద్య శిబిరం

దౌల్తాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):స్వస్థ్ నారీస్వశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం(నేడు) నుంచి అక్టోబర్ 2వరకు దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు అమూల్య ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాధారణ వైద్య శిబిరం, చర్మవ్యాధికి సంబంధించి, 20వ తేదీన చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు, 24వ తేదీన దంత వైద్య శిబిరం, అక్టోబరు 1న గైనకాలజీ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

కులకచర్ల: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం(నేడు) నుంచి అక్టోబరు 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు.

'పోషణ అభియాన్'ను పకడ్బందీగా అమలు చేస్తాం


మోమిన్‌పేట్: శిక్షణలో అంగన్‌వాడీ టీచర్లు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సీడీపీవో ప్రవీణ తెలిపారు. మర్పల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణను ప్రారంభించారు. మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, రిజ్వానా, ధనలక్ష్మి, మర్పల్లి, మోమిన్‌పేట్, బంటారం, కోట్‌పల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యాలాల: తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో యాలాల, బషీరాబాద్ మండల అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్గనూరు రైతు వేదికలో శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో మహేష్‌కుమార్, సూపర్‌వైజర్లు మీనాక్షి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా షీటీమ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్

వికారాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఆడబిడ్డలకు షీటీమ్ అండగా ఉంటుందని షీటీమ్ ఇన్‌చార్జి బుచేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చైతన్య స్కూల్ విద్యార్థులకు మంగళవారం షీటీమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేష్మ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రాజేష్ పాల్గొన్నారు.

దోమ: దిర్సంపల్లి పాఠశాలలో మంగళవారం పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి నర్సిములు సమక్షంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రూప్‌సింగ్, ఉపాధ్యాయులు, షీటీం ప్రతినిధులు సావిత్రి పాల్గొన్నారు.

పాఠశాలలో హౌస్ కమిటీల ఎంపిక

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హౌస్ కమిటీలను ఎంపిక చేశారు. తరగతుల వారీగా నాలుగు హౌస్ కమిటీలను ఏర్పాటు చేశారు. అబ్దుల్ కలాం- రెడ్‌హౌస్, శకుంతలాదేవి- గ్రీన్ హౌస్, సీవీ రామన్- బ్లూ హౌస్, రవీంద్రనాథ్ ఠాగూర్- ఎల్లో హౌస్‌గా వాటికి నామకరణం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణుకుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పలు అంశాలపై ఆసక్తి పెంచేలా, భవిష్యత్తులో పరిపూర్ణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కమిటీలను ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ప్లేస్‌మెంట్ ప్రీమియర్ లీగ్‌కు స్పందన

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ ప్రీమియర్ లీగ్-2025కి అనూహ్య స్పందన లభించింది. డేటా సైన్స్, ఐఈఈఈ సంయుక్తంగా నిర్వహించిన ఈ లీగ్‌లో 175మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.డీన్ స్కూల్ అప్ ఇంజనీరింగు విజయ్‌కుమార్ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు సాంకేతిక, వృత్తి, కమ్యునికేషన్ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(బుద్వేల్) ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఘట్‌కేసర్ ఎస్‌ఐ షేక్ హీనా ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 78మంది వైద్య పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్త జ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి

నవాబుపేట: పులుమామిడికి చెందిన మాజీ జెడ్పీటీసీ సోమనోళ్ల మాణిక్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈయన ఐదు పర్యాయాలు గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీటీసీగా గెలుపొందారు. 40ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉంటూ సేవలందించారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

బొంరాస్‌పేట్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రాక

బొంరాస్‌పేట్: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవారం నాందర్‌పూర్‌కు రానున్నట్లు కురువ సంఘం నాయకులు శ్రీశైలం, రాజు, బాలప్ప తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుంకిమెట్ల హైవేలో నెలరోజుల కిందట 70గొర్రెలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలకు కురువ సంఘం తరఫున ఆర్థిక సాయం అందించేందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం, ఆల్ ఇండియా గొర్రెల సంఘం అధ్యక్షుడు నగేశ్ రానున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

దౌల్తాబాద్: రామన్‌కుంట తండాకు చెందిన నేనావత్ హరీశ్ ఐఐటీ విద్యార్థి వారణాసిలో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. నాయకులు వీరన్న, కృష్ణ, ర్యాలనరేందర్, సేవ్యానాయక్, యువకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో హిందీ దివస్

బషీరాబాద్: తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో మంగళవారం జాతీయ హిందీ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనీల, పీజీటీలు లక్ష్మీకాంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

దుద్యాల: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని దుద్యాల పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కిషన్‌నాయక్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

సాయుధపోరాట యోధులకు ఘన నివాళి

తాండూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తాండూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట యోధులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగసాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నసీమా బేగం, లుక్మాన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ

తాండూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం ప్రత్యేకశిక్షణా కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో మొదటి విడతలో శిక్షణలో పూర్తి చేసుకున్నారు. మరికొంత మందికి తాండూరు సర్వేయర్ మహేష్ శిక్షణ అందిస్తున్నారు. ఈనెల 25వ తేదీతో శిక్షణ పూర్తి కానుంది. శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లకు అక్టోబరు 3వ తేదీన అసైన్‌మెంట్ టెస్టు నిర్వహించనున్నారు. ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్ అందజేస్తారు.

క్లాస్‌మేట్‌కు ఆర్థిక సాయం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న క్లాస్‌మేట్‌కు తోటి విద్యార్థులు అండగా నిలిచారు. ఎదులాబాద్‌కు చెందిన జెడ్పీహెచ్‌ఎస్ 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూస బాల్‌నర్సింహ అనారోగ్యంతో బాధపడుతుండటంతో తోటి మిత్రులు మంగళవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,25,000లను అందజేసి ఆదర్శంగా నిలిచారు.

పాఠశాలకు గ్యాస్ సిలిండర్ అందజేత

బషీరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మైల్వార్ హరిజనవాడ పాఠశాలకు స్థానిక యువకులు రాములుగౌడ్, గడ్డం ప్రకాష్ గ్యాస్ స్టౌ, సిలిండరును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువకులు పలువురు పాల్గొన్నారు.